అభివృద్ధి పనుల బిల్లులకు నిధులు

- త్వరితగతిన పనులు పూర్తి చేయాలి
- అధికారులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశం


లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : జరుగుతున్న అభివృద్ధి పనుల బిల్లులకు ఎటువంటి ఆటంకమూ లేదని, పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులతో అభివృద్ధి పనులపై గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని వివిధ సచివాలయాల పరిధిలో భవనాలు, వెల్‌నెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలు, నాడు – నేడు కింద పాఠశాల భవనాల నిర్మాణాలతోపాటు వివిధ అభివృద్ధి పనులకు ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు విడుదల చేసిందన్నారు. దీంతో పనులు పూర్తి అయిన మేరకు బిల్లుల చెల్లింపులు జరిగాయని, కానీ ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలన్నారు. నిర్మాణ దశలో ఉన్న పనులను పూర్తి చేసి సంబంధిత వ్యక్తులకు వెంటనే బిల్లులు అందించే ఏర్పాటు చేయాలని కోరారు. అధికారులు నిరంతరం పర్యవేక్షించి పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. ఇంకా ఏమైనా బిల్లులు పెండింగ్‌లో ఉంటే వెంటనే అప్‌లోడ్ చేయాలని, ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పంచాయతీల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయా సర్పంచ్‌లను అడిగి తెలుసుకున్నారు. పనుల విషయంలో అధికారులకు ప్రజా ప్రతినిధులు సహకరించాలని చెప్పారు. డీఆర్‌డీఏ పీడీ సందీప్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆనందపురం, భీమిలి, పద్మనాభం జెడ్పీటీసీ సభ్యులు కోరాడ వెంకటరావు, గాడు వెంకటప్పడు, సుంకరి గిరిబాబు, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, తహసీల్దార్ లోకవరపు రామారావు, ఎంపీడీవో అడపా లవరాజు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

ఆనందపురం గ్రామానికి చెందిన మహిళకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన పరిహారం చెక్కుని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అందజేశారు. సుంకరి జయలక్ష్మి అనే మహిళ చేయి దెబ్బతినడంతో శస్త్ర చికిత్స అవసరమైంది. కాగా ఆరోగ్యశ్రీ వర్తించకపోవడంతో అప్పు చేసి శస్త్ర చికిత్స చేయించుకుంది. నిరుపేద కావడంతో సహాయం కోసం దరఖాస్తు చేసుకోగా సీఎం సహాయనిధి నుంచి రూ.70 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఎమ్మెల్యే శ్రీనివాసరావు చెక్కుని బాధితురాలికి అందజేయగా ఆమె ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది.

గురుస్వామి ఆకెళ్ల ఆకస్మిక మృతి


ఆకెళ్ల నర్సింహమూర్తి


ఆకెళ్ల నర్సింహమూర్తి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

భీమునిపట్నం: గురుస్వామి, చిట్టివలస జూట్‌మిల్లు రామాలయ ప్రధాన అర్చకులు ఆకెళ్ల నర్సింహమూర్తి (60) గురువారం గుండెపోటుతో ఆకస్మికంగా చనిపోయారు. ఉదయం రామాలయ ఆవరణలోని షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద గుండెపోటుతో పడిపోయారు. వెంటనే ఆయన్ను ఆస్పత్రికి తరలించగా చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. గత 40 సంవత్సరాలుగా అయ్యప్పస్వామి దీక్ష తీసుకునే భక్తులకు మాలలు వేయడంతోపాటు ఇరుముడులు కట్టడం ద్వారా గురుస్వామిగా ఎంతో గుర్తింపు పొందారు. అలాగే జూట్‌మిల్లు రామలయానికి ప్రధాన అర్చకులుగా సేవలందిస్తున్నారు. రామాలయం ప్రాంగణంలో ఆయన స్వయంగా 35 అడుగుల పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం, 16 అడుగుల సుబ్రహ్మణ్య స్వామి ఆలయం, షిరిడీ సాయిబాబా ఆలయం నిర్మించారు. ఎంతో ఆప్యాయంగా ఉండే ఆయన ఆకస్మికంగా చనిపోవడం అందరినీ కలిచివేసింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, జూట్‌మిల్లు ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు జీరు వెంకటరెడ్డి, కాంగ్రెస్ కార్మిక సంఘ నాయకులు, ఇతర ప్రముఖులు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆయనకు భార్య భానుమతి, ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు


పరదేశిపాలెం సర్వే నంబరు 33/1లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

మధురవాడ: విశాఖ రూరల్ మండలంలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు మరిన్ని చర్యలు చేపడుతున్నట్టు ఆర్‌ఐ మల్లేశ్వరరావు గురువారం చెప్పారు. పరదేశిపాలెం రెవెన్యూ గ్రామంలోని 33/1ఏలో కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు తొలగించి నర్సరీ ఏర్పాటుకు సిద్ధం చేస్తున్న స్థలంలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమించినా, హెచ్చరిక బోర్డులు తొలగించినా చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. పరదేశిపాలెం రెవెన్యూ గ్రామంలోని 33/1ఏ లోనిది ప్రభుత్వ భూమి అని నిర్ధారించిన తర్వాత గత ఏడాది అప్పటి తహసీల్దార్ లోకవరపు రామారావు కలెక్టర్ పేరుతో ఏర్పాటు చేసిన బోర్డులను కూడా మాయం చేశారు. ఈ భూమి కంబాల కొండ రిజర్వ్ ఫారెస్టు నుంచి పరదేశిపాలెం పరిసర భూములకు నీరు ప్రవహించే గెడ్డ భూమిగా నిర్ధారించారు. తాజాగా ఇక్కడ కొందరు వ్యక్తులు డొంకలు తొలగించి చదును చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఏప్రిల్ 10న 'హెచ్చరిక బోర్డు తీసేసి ఆక్రమణకు యత్నం' శీర్షికతో సాక్షిలో కథనం కూడా ప్రచురితమయ్యింది. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి బోర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమి పరిరక్షణకు చర్యలు చేపట్టారు.

క్లుప్తంగా

తాగునీటి సమస్యకు పరిష్కారం


తునిపాలంలో మోటారు ఆన్‌చేసి పైప్‌లైను ప్రారంభిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: మండలంలోని మద్ది పంచాయతీ తునిపాలంలో పంచాయతీ నిధులు రూ.3 లక్షలతో ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్, అదనపు పైప్‌లైన్‌ను ఎంపీపీ కంటుబోతు రాంబాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తాగునీరు సరిపడక తునిపాలం ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. మోటారు ఏర్పాటు చేసి అదనపు పైప్‌లైను వేయడం వల్ల తాగునీటి సమస్య ఉండదన్నారు. ఈ పైప్‌లైను ద్వారా ట్యాంకులకు నీరు పంపిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, తాలాడ గౌరినాయుడు, కాళ్ల శ్రీను పాల్గొన్నారు.

హేచరీల్లో నాణ్యతా ప్రమాణాల పరిశీలన


హేచరీలో పరిశీలిస్తున్న కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ బృందం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు భీమిలి బీచ్ రోడ్డులో గల పలు రొయ్యి పిల్లల ఉత్పత్తి కేంద్రాలు (హేచరీస్)లో నాణ్యతా ప్రమాణాలను కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ (చెన్నై) బృందం గురువారం పరిశీలించింది. ఇందులో భాగంగా తిమ్మాపురం సమీపంలో గల బే ఆక్వా టెక్, అవంతి ఆక్వా మెరైన్, మీనాక్షి హేచరీస్, గోల్డెన్ ఆక్వా హేచరీస్‌ను కోస్టల్ ఆక్వా కల్చర్ ప్రత్యేక అధికారి రమేష్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ రొయ్యి పిల్లల కేంద్రాల్లో పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కేంద్రాల పనితీరు, సామర్థ్యాలు సరిగ్గా ఉన్నాయని తెలిపారు. ఉత్తరాంధ్ర రొయ్యి పిల్లల కేంద్రాల అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, కోశాధికారి గోగుల రామారావుతోపాటు ఫిషరీస్ డిపార్టుమెంట్ అధికారులు పాల్గొన్నారు.

శివాజీ సేవలు స్ఫూర్తిదాయకం


రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయులు

విశాఖ విద్య: కరోనా సమయంలో మృతి చెందిన ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా బాధ్యులు ఏవీఎస్ శివాజీ రెండో వర్ధంతిని ఎస్టీయూ సంఘం ఆధ్వర్యంలో గురువారం నగరంలోని రామ్‌నగర్ లయన్స్ క్లబ్ భవనం నందు ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి ఉపాధ్యాయులంతా పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. శివాజీ జ్ఞాపకార్థం ఉపాధ్యాయులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇమంది పైడిరాజు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా బాధ్యుడిగా, డీసీఈబీ సెక్రటరీగా పనిచేసిన శివాజీ విద్యారంగం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. మంచి మిత్రుడు, విధుల పట్ల అంకితభావంతో పనిచేసిన శివాజీ కరోనా బారిన పడి అందరికీ దూరం కావటం ఎంతో బాధాకరమన్నారు. శివాజీను స్మరించుకునేలా సేవా కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా డీసీఈబీ సెక్రటరీ ఎంపీ. కృష్ణ కుమార్, ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆర్. సన్యాసిరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీ. దేముడుబాబు, రామిరెడ్డి, కోశాధికారి శ్రీధర్, సోమేశ్వరరావు, భాస్కర్, స్వామి నాయుడు, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఐడీ బాండ్ల ఆధారంగా పన్ను విధింపునకు చర్యలు

- మధురవాడ జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి


పన్నుల విధింపుపై ఏసీ రమేష్‌తో చర్చిస్తున్న జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి

మధురవాడ: జీవీఎంసీ పరిధిలో ప్రైవేటు, ప్రభుత్వ భూములు ఆక్రమించి నిర్మించిన భవనాలకు ఐడీ బాండ్ల ఆధారంగా హోల్డర్ ఆఫ్ ది ప్రిమిసెస్ పేరుతో ఆస్తి పన్ను విధింపునకు చర్యలు చేపడుతున్నట్టు జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మి చెప్పారు. ఈ మేరకు గురువారం జోనల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఈ అంశంపై రెవెన్యూ విభాగం అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌తో చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత నెల 28న జీవీఎంసీ సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆక్రమిత స్థలాల్లో ఇళ్ల నిర్మించుకుని నివసిస్తున్న పేదలకు ఆస్తిపన్ను విధించకపోవడం వల్ల కుళాయి కనెక్షన్ వంటివి ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని కౌన్సిల్ దృష్టికి రావడంతో ఈ మేరకు జీవీఎంసీ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఈ ఇబ్బందులు తొలగించేందుకు గతంలో ఇండెమ్నిటీ బాండ్‌పై ఆస్తి పన్ను విధించడం జరిగేదని, ఆవిధంగా చేయాలని చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఆక్రమిత భూములు, స్థలాల్లో నిర్మాణం చేసిన వాటికి రాష్ట్ర పురపాలన డైరెక్టర్, కమిషనర్ సర్క్యులర్ ప్రకారం 'హోల్డర్ ఆఫ్ ది ప్రిమిసెస్' కింద ఆస్తి పన్ను విధిస్తున్నట్టు చెప్పారు. ప్రైవేటు, మునిసిపల్, ప్రభుత్వ, అర్బన్ ల్యాండ్ సీలింగ్, దేవదాయ, వక్ఫ్ భూములలో దస్తావేజులు, పట్టా, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ పొజిషన్ సర్టిఫికెట్ లేకుండా నిర్మించిన భవనాలకు నూరు శాతం జరిమానాతో ఆస్తి పన్ను విధించవచ్చునని ఆదేశాలు వచ్చినట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని కనక మహాలక్ష్మి కోరారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆనందపురం : మండలంలోని వెల్లంకి, బొడ్డపాలెం, గంభీరం, బోయిపాలెం, ఏపీఐఐసీ ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈఈ సురేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకూ విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేడు అచ్యుత పూజ

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ దరి ఒమ్మివానిపాలెంలో శుక్రవారం పాలకొలుపు అచ్యుత పూజ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో స్థానికులు హాజరుకావాలని కోరారు.

పారిశుధ్య పనుల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

మధురవాడ: పారిశుధ్య పనుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని జీవీఎంసీ జోన్ – 2 కమిషనర్ కె.కనక మహాలక్ష్మి సూచించారు. క్షేత్ర పర్యటనలో భాగంగా బీ2 కాలనీ సమీపంలోని బాబా కాలేజీ, బక్కన్నపాలెం పరిసర ప్రాంతాల్లో శానిటేషన్ పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంగా నీటి నిల్వల తొలగింపు, పారిశుధ్య పనులు సమర్థంగా చేపట్టాలన్నారు. బాబా కాలేజీ సమీపంలో డ్రెయిన్ మొత్తం పగిలిపోవడంతో మిషన్‌తో కాల్వలో పూడిక తీయించి మురుగు నీరు తరలించారు.

బీఎస్ఎన్ఎల్ టవర్ల ఏర్పాటుకు చర్యలు


స్థల మంజూరు పత్రాలు అధికారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : మండలంలో సెల్ సిగ్నల్స్ అందని నాలుగు మారుమూల గ్రామాలకు బీఎస్ఎన్ఎల్ సంస్థ సెల్ టవర్లు ఏర్పాటుకు అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశాలతో రెవెన్యూ అధికారులు స్థలాలు కేటాయించి బీఎస్ఎన్ఎల్ సంస్థకు ముందస్తుగా అందజేశారు. గతంలో జరిగిన పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే, అధికారులు పాల్గొన్నప్పుడు ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు సెల్ సిగ్నల్స్ అందడం లేదని వినతిపత్రాలు అందజేశారు. ఈ మేరకు దబ్బంద, చిన దబ్బంద, రామవరం, గోరింట, కుసులువాడ పంచాయతీ ఇచ్ఛాపురం గ్రామాల్లో సెల్ టవర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని గుర్తించి ఇటీవల బీఎస్ఎన్ఎల్ సంస్థ అధికారులు ఆయా గ్రామాలకు వెళ్లి స్థలాలను పరిశీలించారు. ఈ మేరకు ప్రతి గ్రామంలోనూ సెల్ టవర్ ఏర్పాటు కోసం ఐదేసి సెంట్లు చొప్పున ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు కేటాయించగా పత్రాలను సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల ప్రజలకు ఇక ఇంటర్నెట్, ఇతర సమాచార సేవలు సులభతరమవుతాయని చెప్పారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామని బీఎస్ఎన్ఎల్ అధికారులు తెలిపారు.

సమయపాలన తప్పనిసరి

మహారాణిపేట: డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది అందరూ సమయపాలన తప్పనిసరిగా పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. మద్రిపాలెం శివనగర్ ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. రికార్డులు, మందుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షలో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు మాట్లాడుతూ అన్ని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. బర్త్ ప్లానింగ్ గురించి, హైరిస్క్ గర్భిణులను గుర్తించి డాక్టర్ల సలహా నిమిత్తం ఐరన్ ఫోలిక్ మాత్రలు, పోషకాహారం తీసుకునేటట్లు ప్రోత్సహించాలన్నారు. సాధారణ ప్రసవాలు అయ్యేలా ప్రోత్సహించాలని, శస్త్రచికిత్స ప్రసవాలను తగ్గించాలని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది అందరూ డ్రెస్ కోడ్ పాటించాలని పలు సూచనలిచ్చారు. యూపీహెచ్‌సీ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్వారీ కుటుంబాలకు న్యాయం చేయాలి


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న క్వారీ కార్మికులు

భీమునిపట్నం: క్వారీ పనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కార్మికులకు తగిన న్యాయం చేయాలని సీఐటీయూ క్వారీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఆర్.ఎస్.ఎన్.మూర్తి కోరారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు గురువారం నిర్వహించిన ఆందోళనలో ఆయన పాల్గొన్నారు. మండలంలోని దాకమర్రి వద్దనున్న ఎర్ర క్వారీపై వంద కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయన్నారు. కాగా జీవీఎంసీ పరిధికి చెందిన అర్హులకు ఇక్కడ క్వారీ పక్కనే జగనన్న ఇళ్ల స్థలాలు కేటాయించారన్నారు. అయితే దీనివల్ల సమస్యలు ఎదురవుతాయని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ఇళ్ల స్థలాలు వేరే ప్రాంతంలో కేటాయించాలని కోరారు. అలా చేస్తే అందరికీ మేలు జరుగుతుందని, అధికారులు ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ముద్దాడ రాము, తోటయ్య, రామారావు, నాయుడు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

సింహాచలం: మహిళ అదృశ్యంపై పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ అప్పారావు తెలిపిన వివరాలు.. లక్ష్మీపురానికి చెందిన ఒప్పంగి వెంకటలక్ష్మి(35) ఈనెల 2వతేదీన సాయంత్రం 4గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటకి వెళ్లి తిరిగిరాలేదు. వెంకటలక్ష్మి భర్త ఒప్పంగి సూర్యనారాయణ, కుటుంబ సభ్యులు వెతికారు. ఆమె జాడ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెచ్‌సీ ప్రకాష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇస్కాన్‌లో వైభవంగా నరసింహ చతుర్దశి వేడుకలు


పూజలు అందుకున్న శ్రీ నరసింహ స్వామి


ప్రత్యేక అలంకరణలో శ్రీ రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిర్‌లో గురువారం నరసింహ చతుర్దశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఇస్కాన్ అధ్యక్షులు సాంబాదాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో తెల్లవారుజామున 4.30 గంటలకు స్వామి దర్శనం, 8గంటలకు హారతి, గురుపూజ నిర్వహించారు. శ్రీ రాధా దామోదరులను వివిధ రకాల పువ్వులు, ఆభరణాలు, ప్రత్యేక దుస్తులతో అలంకరించారు. అనంతరం శ్రీ రాధా దామోదరులను ప్రత్యేకంగా చందనంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం 10 గంటలకు లోక కల్యాణార్థం నరసింహ యజ్ఞం, సాయంత్రం కీర్తనలు, నరసింహస్వామికి అభిషేకం చేశారు.

రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: జీవీఎంసీ 1వ వార్డు పరిధిలోని జీరుపేట వద్ద నుంచి చిట్టివలస జ్యూట్‌మిల్లు వరకు వెళ్లే బొగ్గురోడ్డు విస్తరణ, మరమ్మతులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రాంతాల్లోనూ రోడ్లు సుందరంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటోందని, అందులో భాగంగానే రూ.70 లక్షలతో నిర్మిస్తున్నామన్నారు. ఇతర ప్రాంతాల్లో కూడా అవసరమైన మేరకు జాప్యం లేకుండా రోడ్డు పనులు చేపడుతున్నామని, దీనివల్ల అందరికీ ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ప్రతిపక్షాలు అదే పనిగా రోడ్లను పట్టించుకోవడంలేదని విమర్శలు చేస్తున్నాయని, గతంలో కన్నా ఇప్పుడు అన్ని రహదారులు ఎంతో బాగున్నాయన్నారు. ఇతర అభివృద్ధి పనులు కూడా విస్తృతంగా జరుగుతున్నాయని, ఈ విషయంలో ప్రజలంతా సంతృప్తిగా ఉన్నారన్నారు. జీవీఎంసీ కోఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, నాయకులు అక్కరమాని రామునాయుడు, భాస్కరరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, చిప్పాడ వెంకటేష్, జీరు సుజాత తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు నిర్మించి... డ్రైనేజీలు విస్మరించారు


చిట్టివలస కళ్లాల వైపు డ్రైనేజీలు లేని రోడ్డు


ఇళ్ల మధ్య డ్రైనేజీ లేకుండా వేసిన సీసీ రోడ్డు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు చిట్టివలస శివారు గ్రామాల్లో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో హడావుడిగా సీసీ రోడ్లు నిర్మించి డ్రైనేజీలు మరిచిపోయారు. శారద పబ్లిక్ స్కూల్ చుట్టూ విస్తరించిన ఈ గ్రామాన్ని ఆనుకుని వ్యవసాయ భూములు, పెద్ద చెరువు ఉన్నాయి. మామూలు రోజుల్లోనే ఇక్కడి ప్రజల ఇళ్లలో వాడుక నీరు బయటకు వెళ్లే అవకాశం లేని కారణంగా గోతులు తీసి అందులో నిల్వ చేస్తుంటారు. ఇక వర్షాకాలమైతే ఎక్కడ వర్షం కురిస్తే అక్కడే నీరు నిలిచిపోవడంతోపాటు సీసీ రోడ్లు లేని మిగిలిన ప్రదేశాలు చెరువులా మారిపోతున్నాయి. ఇళ్ల చుట్టుపక్కల నిలిచిన వర్షం నీరు అలాగే రోజులు గడచిన కొద్దీ భూమిలో ఇంకిపోవడం తప్ప బయటకు వెళ్లేందుకు డ్రైనేజీలు లేక తరచూ స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

డ్రైనేజీలు లేని కారణంగా ఇళ్లలో బోరు బావులు కలుషితం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అయినా డ్రైనేజీలు నిర్మించాలని ఇటీవల ఇక్కడి ప్రజలు 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకొచ్చారు.

సిరులతల్లికి సహస్ర తులసి పూజ

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవా, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో 44 మంది ఉభయదాతలు పాల్గొన్నారు.

పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు బోదిలపాటి సత్యరూపవాణి, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, వి. మారుతీప్రసాద్, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

శిక్షణ తరగతులకు హాజరు కావాలి


పెద్దిపాలెంలో విద్యార్థిని రూఆన్సీతో మాట్లాడుతున్న అధికారులు

ఆనందపురం : ఇటీవల జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని విద్యార్థుల ఇంటికి విద్యాశాఖాధికారులు వెళ్లి ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న శిక్షణను వినియోగించుకోవాలని కోరుతున్నారు. ముఖ్యంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదివి ఉత్తీర్ణులు కాని ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు నేల్తేరులో ఉన్న కేజీబీవీలో ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ శిక్షణకు 97 మంది హాజరు కావాల్సి ఉండగా 47 మంది హాజరవుతున్నారు. మిగతా విద్యార్థుల కోసం అధికారులు వారి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి తరగతులకు హాజరు కావాలని కోరుతున్నారు. చాలా మంది సుముఖత వ్యక్తం చేయడంతో అధికారులు సఫలీకృతమవుతున్నారు. గురువారం ఏపీసీ శ్రీనివాసరావు, జీసీడీవో కలేసా బేగం, కేజీబీవీ ప్రత్యేకాధికారి చంద్రకళ మండలంలోని పెద్దిపాలెం, ఈగలవానిపాలెం గ్రామాల్లో పర్యటించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు పూర్తయ్యే వరకూ శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు.